www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 7 డిసెంబర్ 2025
5
పశ్చిమ గోదావరి

రోడ్డు పనులు నాణ్యంగా ఉండాలి: జెసి

పరిశీలిస్తున్న జెసి

ప్రజాశక్తి - గణపవరం

రోడ్డు పనులు నాణ్యతగా ఉండాలని, పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. యాభై లక్షలతో పనులు జరుగుతున్న గణపవరం, పెంటపాడు వయా వెస్ట్ విప్పర్రు ఆర్అండ్‌బి తారు రోడ్డు పనులను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రోడ్డు మందాన్ని పరిశీలించారు. మంజూరైన నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు పనులు సక్రమంగా జరిగితే ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడానికి దోహదపడుతుందన్నారు. నాణ్యతగా రోడ్డు పనులు జరగాలని అధికారును ఆదేశించారు. ఆయన వెంట ఆర్ అండ్ బి అసిస్టెంట్ ఇంజినీర్ డి.రవిబాబు ఉన్నారు.

జెడ్‌పి రూటే.. సెపరేటు..!

- పాలన ముగిసే ముందు ఇష్టానుసారం నిర్ణయాలు
- జాతీయ నేతల విగ్రహాలు మూసివేస్తూ షాపుల నిర్మాణం
- బినామీలకు కట్టబెడుతూ ప్రధాన గేటు పక్కన 3 షాపుల నిర్మాణమని ఆరోపణలు
- వ్యాపారం ముసుగులో వందల ఏళ్ల చెట్లు సైతం నరికివేత
- సెక్షన్ ఆధునికీకరణ నిధుల ఖర్చుపై ఇప్పటికీ లెక్కలు కరువు
- ఉద్యోగ సంఘ భవనం కమర్షియల్‌కు ఇచ్చి అభాసుపాలు
- జిల్లా పరిషత్‌లో అవకతవకలపై ఇటీవల డీసెంట్ నోట్ ఇచ్చిన సభ్యులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ పాలకుల పదవీకాలం దగ్గరపడటంతో హడావుడిగా ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారం పేరుతో వందల ఏళ్లనాటి చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేసిన పాలకులు ఇప్పుడు మరో విధ్వంసానికి పూనుకున్న పరిస్థితి కన్పిస్తోంది. ఏలూరు ప్రధాన రహదారిపై వెళ్లేవారికి కన్పించేలా ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల విగ్రహాలను కన్పించకుండా వాణిజ్య దుకాణాలు నిర్మించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిషత్ పాలకులకు 2026 సెప్టెంబర్‌తో పదవీకాలం ముగియనుంది. సకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సైతం సన్నాహాలు చేస్తోంది. దీంతో ప్రస్తుత పాలకులు దిగిపోయే ముందు.. దండుకుందాం అనే రీతిలో వ్యవహారాలు సాగిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 40 లక్షల జనాభాకు జవాబుదారీతనంగా ఉండాల్సిన జిల్లా పరిషత్ అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. జిల్లా పరిషత్ ప్రధాన గేటుకు పక్కగా మహాత్మాగాంధీ, అంబేద్కర్, జ్యోతిరావుపూలే, బాబు జగ్జీవన్‌రావు, మదర్ థెరిస్సా వంటి నేతల విగ్రహాలు ఉన్నాయి. ఏలూరు మీదుగా విజయవాడ వెళ్లే వారందరికీ ఈ విగ్రహాలు కన్పిస్తాయి. ఇవి జిల్లా పరిషత్ హుందాతనాన్ని ఎంతగానో ఇనుమడింపచేస్తున్నాయి. జాతీయ నాయకుల విగ్రహాలు ఇక నుంచి జనాలకు కన్పించకుండా చేసే ప్రక్రియకు పాలకులు, అధికారులు పూనుకున్నారు. ప్రధాన గేటు పక్కగా జాతీయ నాయకుల విగ్రహాలను మూసివేసేలా వాణిజ్య దుకాణాల నిర్మాణం చేపట్టారు. ఇరువైపులా మూడు షాపుల నిర్మాణానికి అనుమతులు పొందినట్లు తెలుస్తోంది. పనులు సైతం ప్రారంభించేశారు. కొంతమంది బినామీల పేరున ఈ షాపులకు అనుమతులిచ్చి నిర్మిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ షాపుల నిర్మాణం కోసం కొన్ని నెలల క్రితమే వందళ్ల ఏళ్ల వయసున్న చెట్లను సైతం నరికేశారు. ఇప్పటికే జిల్లా పరిషత్ ఆవరణలో దాదాపు తొమ్మిది వరకూ వ్యాపార దుకాణాలను నిర్మించారు. ఆ దుకాణాల నుంచి అద్దెలు సకాలంలో వసూలు చేస్తున్నారో, లేదో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇప్పుడు కొత్తగా దుకాణాల నిర్మాణం సైతం రాజకీయ నాయకుల స్వలాభంతో జరుగుతుందనే చర్చ సర్వత్రా సాగుతోంది.

సెక్షన్ నిధులపై లెక్కలు కరువు

జిల్లా పరిషత్ ప్రధాన కార్యాలయంలో సెక్షన్ల ఆధునికీకరణకు 2024 జనవరిలో రూ.90.40 లక్షలకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. సెక్షన్ కార్యాలయాలకు తలుపులు పెట్టడం తప్ప ఇతర పనులేవీ చేయని పరిస్థితి ఉంది. ఈ నిధులతో సెక్షన్ కార్యాలయాల్లో ఎసిల ఏర్పాటుతోపాటు ఇతర పనులు చేయాల్సి ఉంది. రూ.90 లక్షల నిధులు ఏవిధంగా ఖర్చు చేశారో లెక్కలు చెప్పేవారే కరువయ్యారు. ఉద్యోగ సంఘ భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడం వివాదమై అభాసుపాలయ్యారు. చివరికి అనుమతులు రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాము పంపించిన ఫైల్స్‌పై సంతకాలు చేయకపోతే అధికారులను ఇబ్బంది పెడుతున్నారనే చర్చ నడుస్తోంది. జిల్లా పరిషత్‌లో నిధుల వినియోగానికి సంబంధించి విచారణ నిర్వహిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

జాతీయ నాయకుల విగ్రహాలను మూసేసేలా దుకాణాల నిర్మాణం

అవకతవకలపై సర్వసభ్య సమావేశంలో డీసెంట్ నోట్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నవంబర్ 25న జరిగింది. ఎజెండాలో ఇచ్చిన అంశాల్లో అనేక అవకతవకలు ఉన్నాయని జిల్లా పరిషత్ సభ్యులు కొంతమంది డీసెంట్ నోట్ ఇచ్చారు. డీసెంట్ నోట్‌లో అనేక అంశాలను ప్రస్తావించారు. బహిరంగ వేలం పెట్టకుండా కలిదిండి, కాళ్లతోపాటు ఇతర మండలాల్లో ప్రస్తుత లీజుదారులను కొనసాగించడం, గతంలో మంజూరు చేసిన 209 పనులకు రూ.పది కోట్లు, రూ.164 పనులకు రూ.8 కోట్లు పనుల పేర్లు లేకుండా, అంచనా విలువ లేకుండా అనుమతికి పెట్టడం, ఫ్లవర్ బొకేలకు, కేకులకు రూ.లక్షా 20 వేలు ఖర్చు పెట్టడం వంటి అనేక అంశాలు డీసెంట్ నోట్‌లో ఉన్నాయి. సమావేశాల సమయంలో భోజన ఖర్చుల కింద రూ.లక్షలు బిల్లులు పెడుతున్నట్లు సైతం చర్చ నడుస్తోంది. పాలకులకు జిల్లా పరిషత్ అధికారులు వత్తాసు పలుకుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

గంజాయి గుండాల చేతిలో పెంచలయ్య హత్యపై
లోకేష్, పవన్‌కళ్యాణ్ స్పందించకపోవడం సిగ్గుచేటు
ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్
ఘనంగా ప్రారంభమైన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా 47వ మహాసభ శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలో ఘనంగా ప్రారంభమైంది. తొలుత తాలూకా ఆఫీస్ సెంటర్ నుంచి ఫ్లై ఓవర్ సెంటర్ మీదుగా చుక్క అప్పలస్వామి భవనం (అవరా వర్కర్స్ యూనియన్) వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పట్టణంలోని అన్ని విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలేవీ నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వక విద్యార్థులు నానావస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెంలో నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ ఉన్నప్పటికీ నామమాత్రపు పీజీ కోర్సులతో మొక్కుబడిగా మాత్రమే నడుస్తోందన్నారు. అన్ని రకాల పీజీ కోర్సులను ఈ క్యాంపస్‌లో పెట్టడం ద్వారా జిల్లాలో అనేక మంది పేద విద్యార్థులకు మేలు చేకూరుతుందన్నారు. మెడికల్ సీట్ల అమ్మకాన్ని వ్యతిరేకించిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత కాలేజీలనే అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిర్విరామ పోరాటం సాగిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెల్లో గంజాయిని నిర్మూలిస్తానని వాగ్దానం చేసిన పవన్ కళ్యాణ్ నెల్లూరులో గంజాయికి వ్యతిరేకంగా పోరాడుతున్న యువకుడు పెంచలయ్య హత్యపై కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ సభలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మణ్, సింధు, నాగేంద్ర, గణేష్, కేశవ, భాను, క్రాంతి పాల్గొన్నారు.

ర్యాలీలో నేతలు, విద్యార్థులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి

3కె రన్ ర్యాలీలో కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

యువత దేశానికి దిశ నిర్దేశమని, వారికి ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన తప్పనిసరని, అప్పుడే ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ట్రాఫిక్‌పై అవగాహన కోసం బివి.రాజు కాలేజీ నుంచి 3కె రన్ ర్యాలీని ఆమె శనివారం ప్రారంభించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, కళాశాల విద్యార్థులు, అధికారులు, ప్రజలు, అథ్లెటిక్స్, వాకర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ రన్ జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఒక ప్రాణాన్ని కోల్పోతే వారి కుటుంబమే కాకుండా, ఎన్నో కుటుంబాలపై దాని ప్రభావం ఉంటుందన్నారు. అంతా ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ యువత, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా మరొకరికి ఆదర్శంగా ఉండాలన్నారు. అప్పుడే ప్రమాదాలను నియంత్రించగలమన్నారు. 'ఫిట్ ఇండియా' కాన్సెప్ట్‌తో శారీరక దారుఢ్యంపై అవగాహన కల్పించేందుకు విష్ణు కాలేజీ విద్యార్థుల లఘు ప్రదర్శన ఆకట్టుకుంది. ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనర్థంపై లఘు ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎఎస్‌పి వి.భీమారావు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద, జిల్లా రవాణా అధికారి కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, డిఇఒ ఎం.రామారావురెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇఇ విజయ్, డిఇఒ ఇ.నారాయణ, డిఎస్‌డిఒ దాసు, ఎల్‌డిఎం ఎ.నాగేంద్రప్రసాద్, ఎంహెచ్‌ఒ సోమశేఖర్, రెడ్‌క్రాస్ ప్రతినిధి గోపిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో రన్నింగ్ చేస్తున్న కలెక్టర్, ఎస్‌పి

విభిన్న ప్రతిభావంతులు ధైర్యంగా ముందుకు సాగాలి

విభిన్న ప్రతిభావంతులు ధైర్యంగా ముందుకు నడవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శనివారం డిఎన్‌ఆర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జిల్లాస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ద్విచక్ర వాహనాల పోటీలు, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలను ప్రారంభించి స్వయంగా తిలకించారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యం కావాలి

రాజ్యాంగ ప్రచార వేదిక రాష్ట్ర నేత మంతెన సీతారాం
దేశ సమైక్యతకు రాజ్యాంగమే మూలస్తంభం
'అంబేద్కర్ స్ఫూర్తి-రాజ్యాంగ విలువలు'పై
రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలందరూ ఐక్యమవ్వాలని, అందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రాజ్యాంగ ప్రచార వేదిక రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో శనివారం రాజ్యాంగ ప్రచార వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా 'అంబేద్కర్ స్ఫూర్తి-రాజ్యాంగ విలువలు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి వక్తలంతా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎల్ఐసి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాజమండ్రి డివిజన్ నాయకులు ఎన్.అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త మంతెన సీతారాం మాట్లాడుతూ సోషలిజం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం వంటి అనేక అంశాలకు రాజ్యాంగం పునాదిగా ఉందన్నారు. అంబేద్కర్ భారతదేశం గర్వించదగ్గ మహనీయుడని, అందరివాడని అన్నారు. స్వాతంత్రం వచ్చిన దగ్గర నుంచి నేటి వరకు దేశంలో మత గ్రంథాలు, పుక్కిట పురాణాలకు ఇచ్చిన ప్రాధాన్యత, ప్రచారం రాజ్యాంగానికి ఇవ్వలేదని, నేడు ఆ లోటును భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేడు రాజ్యాంగం మౌలిక స్వభావాన్ని మార్చి మను సంస్కృతిని, సనాతన ధర్మాల పేరుతో ప్రజల మీద రుద్దే ప్రయత్నం జరుగుతుందన్నారు. సార్వభౌమాధికారం, సమానత్వం, సౌభ్రాతత్వం వంటి గొప్ప అంశాలు మన రాజ్యాంగంలో ఉన్నాయని, వాటిని నేటి యువతకు పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రాలకున్న హక్కులను కుదించడం, ప్రజల హక్కులను హరించడం, రాజ్యాంగ వ్యవస్థలను స్వప్రయోజనాలకు వాడుకోవడం అలవాటుగా మారిందని విమర్శించారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, ఎస్‌సి, ఎస్‌టి డివిఎంసి మెంబర్ జె.సత్యసుధామ, బిఎస్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోన జోసఫ్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను, రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులు, ఆదేశిక సూత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్, ఎస్‌సి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎ.వీరయ్య, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోడదాసి గంగయ్య, టియుసిసి నాయకులు దండు శ్రీనివాసరాజు, ప్రజానాట్యమండలి నేత మల్లుల సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఐక్యతను దెబ్బతీసే విధంగా మతోన్మాదాన్ని నూరిపోస్తున్నారన్నారు. ఎపి ఎంఎస్‌ఆర్‌యు జిల్లా నాయకులు ఎస్.శ్రీనివాస్, సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, కౌలు రైతుసంఘం నాయకులు మామిడిశెట్టి రామాంజనేయులు, రైతుసంఘం నాయకులు పుల్లారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం చేపట్టిన పాలకులే రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, ఐద్వా నేత లక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, ప్రజాసంఘాల నేతలు ఇంజేటి శ్రీనివాస్, డేగల నాగేశ్వరరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, రాజబాబు, జయరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీతారాం

కేన్సర్‌తో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న నాళం భాగ్యశ్రీ(13) శనివారం కేన్సర్‌తో మృతిచెందింది. నాళం లక్ష్మణరావు, శిరీషలకు ఇద్దరు కుమార్తెలు కాగా భాగ్యశ్రీ పెద్ద కుమార్తె, ఈమె గత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడటంతో స్థానిక పిహెచ్‌సిలో చూపించారు. అనంతరం ఒక ఆర్ఎంపి వైద్యుడును కూడా సంప్రదించారు. ఆర్ఎంపి వైద్యుడు సూచనల మేరకు వారు పాలకొల్లులో ఒక పెద్దాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి భాగ్యశ్రీ ఆరోగ్యం బాగా క్షీణించిందని చెప్పి వారి సూచనల మేరకు అక్కడ నుండి విజయవాడ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే భాగ్యశ్రీ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మృతిపై స్థానిక పిహెచ్‌సి సిబ్బంది భాగ్యశ్రీ మృతికి గల కారణాలు సేకరించినట్లు సిహెచ్ఒ కొల్లు ప్రసాద్ తెలిపారు. భాగ్యశ్రీ శరీరంలో తెల్ల రక్తకణాల సంఖ్య తగ్గిపోవడంతో పాలకొల్లులో ప్రయివేటు వైద్యులు కేన్సర్‌గా గుర్తించి విజయవాడ సిఫార్సు చేసినట్టు తెలిపారు. లక్ష్మణరావు చిన్నకుమార్తె స్వప్న కూడా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈమెకు స్థానిక పిహెచ్‌సిలో వైద్యం చేయిస్తున్నారు. పెద్దకుమార్తె మృతిచెందడం, మరో పక్క చిన్న కుమార్తె అనారోగ్యంతో బాధపడటం స్థానికులను కలిచివేస్తుంది.

భాగ్యశ్రీ(ఫైల్ ఫొటో)

ప్రజా సమస్యలను గాలికొదిలేస్తున్న నాయకులు

మండలంలో వివిధ గ్రామాల్లో అనారోగ్య పరిస్థితులు తాండవిస్తున్నాయంటూ సిపిఎం అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే అధికారి లేడు. సమస్యలపై చర్చించవలసిన మండల పరిషత్ సమావేశంలో నాయకులు ఆధిపత్యపోరుకు వేదికగా మారుస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాలు సైతం పదవీకాలం ముగియడంలో ప్రజా సమస్యల పట్ల శ్రద్ధ కనపర్చడం లేదన్న విమర్శలు వెళువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆమె అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, మహిళల విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అంటరానితనం, కులవివక్ష వంటి సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడారని, న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా దేశానికి విశేష సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎన్‌వి.అరుణకుమారి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, వివిధ ఎస్‌సి, ఎస్‌టి సంఘాల నేతలు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్

వట్టి మాటలేనా.. గట్టి చేతలుండేనా..!

'వట్టి మాటలు కట్టిపెట్టోయ్.. గట్టి మేలు తలపెట్టవోయ్' అని మహాకవి గురజాడ పలుకులు ప్రస్తుతం రెండు జిల్లాల్లోని ప్రజల ఆకాంక్షలుగా మారాయి. పాలకులు, ఉన్నతాధికారులు మాటలకే పరిమితమవుతున్నారు తప్ప చేతలు ఉండటం లేదని అంతా పెదవి విరుస్తున్నారు. ఏలూరు జిల్లాలో సిఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా మరోసారి జిల్లాలోని సమస్యలు తెరపైకొచ్చాయి. 'బొమ్మాళీ.. నిన్ను వదలా' అనే రీతిలో రైతులను ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతున్నాయి.

సిఎం చంద్రబాబు ఉంగుటూరు నియోజకవర్గ పర్యటన అట్టహాసంగా సాగింది. కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి పెన్షన్ సొమ్ము అందించిన చంద్రబాబు ఆ కుటుంబ సమస్యలు తెలుసుకుని ఆపన్న హస్తం అందిస్తూ పలు హామీలిచ్చారు. కచ్చితంగా ఆ కుటుంబం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని, చంద్రబాబు స్పందనను అంతా హర్షించాల్సిందే. అయితే ఇటువంటి కుటుంబాలు ఇంకా చాలా ఉన్నాయి. వైద్యానికి ఖర్చు పెట్టలేక ఆస్తులు అమ్ముకుని, అప్పుల పాలై, పిల్లల చదువులు ఆపించేసిన కుటుంబాలు కోకొల్లలు. దీనంతటికీ పరిష్కారం చూపాల్సిన బాధ్యత పాలకులపై కచ్చితంగా ఉంది. అదేదో ఆర్థిక సాయం అనుకుంటే పొరబడినట్లే. వైద్యం అందరికీ ఉచితంగా అందేలా ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేయడం, అన్ని తరహా వ్యాధులకు చికిత్స అందించేలా సదుపాయాలు కల్పించడంతోపాటు వైద్యులు, సిబ్బంది నియామకం అత్యంత కీలకం. అదే జరిగితే జిల్లాలోని సగం కుటుంబాలు అప్పుల బారి నుంచి బయటపడి ఆనందంగా జీవిస్తాయంటే అతిశయోక్తి కాదు. కిడ్నీ వ్యాధిగ్రస్తులే కాదు.. రెండు జిల్లాల్లో కేన్సర్ మహమ్మారి పడగలు విప్పి బుసలు కొడుతోంది. వీధికో కేన్సర్ బాధితులు కన్పిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేన్సర్ నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటూనే, మరోపక్క రోగులకు చికిత్స అందించేలా ప్రభుత్వాసుపత్రుల్లో, ప్రధానంగా రెండు జిల్లాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందో.. లేక వట్టి మాటలతో సరిపెడుతుందో వేచిచూడాలి. ఇక సిఎం తన ప్రసంగంలో కొల్లేరు సమస్యకు పరిష్కరిస్తామని ప్రకటించారు.

కొల్లేరు సాధికారత కమిటీ నివేదిక ఏమిటో తెలియని పరిస్థితి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అక్కడి ప్రజలు కోరుతుంటే ఎకో సెన్సిటివ్ జోన్ పేరిట పదో కాంటూరుకు విస్తరించేలా చర్యలు కన్పిస్తున్నాయి. సాక్షాత్తూ ఎన్నికల సభలో ప్రధాని మోడీ, రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం సైతం ఆచరణకు నోచని దుస్థితి కన్పిస్తోంది. ఈ పరిస్థితుల్లో సిఎం చంద్రబాబు ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారో స్పష్టం చేయడంతోపాటు అక్కడి ప్రజలకు మేలు జరిగేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇక చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిపై మాట్లాడుతున్న పాలకులు అక్కడ భూములిచ్చిన రైతుల గోడు పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. గతంలోనూ చంద్రబాబు సిఎంగా ఉండగానే ఈ అంశాన్ని నాన్చుతూ కాలం గడిపారనే ఆరోపణలు ఉన్నాయి. మరి ఇప్పుడు రైతులకు న్యాయం చేసి చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేస్తారో, లేక రైతులను పక్కన పెట్టి పూర్తి చేస్తారో వేచిచూడాలి.

ఇక దేశానికి వెన్నెముక రైతు అని, తమది రైతు ప్రభుత్వమని నాటి నుంచి పాలకులు వల్లె వేయడం తప్ప ఆచరణలో రైతులకు మిగిల్చేది అప్పులేనని ఎవరినడిగినా ఇట్టే చెబుతారు. అయితే ధాన్యాగారంగా పేరొందిన పశ్చిమగోదావరి జిల్లాలో వరి రైతుల పరిస్థితి ఏమిటో ఏ రోడ్డెక్కినా కళ్లకు కట్టినట్లు కన్పిస్తోంది. మొంథా, దిత్వా తుపాన్ల బారిన పడిన వరి పంటను ఎట్టకేలకు మాసూళ్లు చేసి అమ్ముకుందామనుకుంటే తేమ శాతం నిబంధన అడ్డంకిగా మారింది. దీంతో రైతులు తమ ధాన్యాన్ని రోడ్లే కళ్లాలుగా చేసుకుని ఆరబెట్టుకుంటున్నారు. రెండు తుపాన్ల దెబ్బతో వరి పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. పైపెచ్చు తేమ శాతం నిబంధన, ఇతర పేర్లతో మిల్లర్లు ధాన్యం ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారనేది బహిరంగ రహస్యం. ప్రభుత్వం మాత్రం నష్టం 33 శాతంకన్నా ఎక్కువ ఉండాలనే నిబంధన పేరుతో రైతులకు పరిహారం ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతుంది. పెట్టుబడి ఖర్చులు, శ్రమ అన్నీ కలిపి పరిహారం లెక్కగట్టకపోయినా నష్టం శాతం నిబంధన పక్కన పెట్టి అరకొర పరిహారమైనా రైతులకు అందిస్తే సాగు సజావుగా సాగే అవకాశం ఉంది. వరి కాదని ఆక్వా సాగుకు వెళ్లిన రైతులు ఇప్పటికే అక్కడ నష్టాలు పెరగడంతో ఏం చేయాలో పాలుపోక సాగుకే దూరమవుతున్నారు. ఈ పరిణామాలన్నీ చూస్తే ధాన్యాగారం, ఆక్వా హబ్ అనే మాటలు గత చరిత్రగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా వ్యవసాయం విషయంలో పాలకులు వట్టి మాటలు కట్టి పెట్టి.. గట్టి చేతలు తలపెడితేనే ఎంతోకొంత ఉపయోగం ఉంటుందని అందరి మాట.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు

మొగల్తూరు: సొసైటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన ధర్నాలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఉపాధ్యక్షులు కంచర్ల సత్యనారాయణమూర్తి(సోనీ) పిలుపునిచ్చారు. తమ సమస్యల పరిష్కారంలో భాగంగా సొసైటీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి శనివారం విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను ఆయన వివరించారు. జిఒ 36 వెంటనే అమలు చేయాలని, 2019, 2024 వేతన సవరణ వెంటనే చేయాలని, గ్రాట్యుటీ యాక్టు ప్రకారం అమలు చేయాలని, డ్యూ టూలో పెట్టిన జీతాలను రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62 సంవత్సరాలకు పెంచాలని, 2019 తరువాత చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సంఘాలకు సేరుధనంపై ఇవ్వవలసిన 6 శాతం డివిడెంట్, వడ్డీ చెల్లించాలని, సొసైటీ లాభ, నష్టాలతో సంబంధం లేకుండా జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలు తెలి పారు. ఈనెల 8వ తేదీ సోమవారం రా ష్ట్రవ్యాప్తంగా అ న్ని డిసిసిబి బ్రాంచీల ఎదుట సహకార సంఘాల ఉద్యోగులతో ధర్నా, 16న మంగళవారం రా ష్ట్రం లో ఉన్న అన్ని జిల్లా సహకార కార్యాలయాల వద్ద ధర్నా, వినతి పత్రం అందించడం, 22న సోమవారం రాష్ట్రంలో ఉన్న అన్ని డిసిసిబి ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నా, వినతి పత్రం అందిస్తామన్నారు. 29న సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల ఉద్యోగులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా, ఉన్నతాధికార్లకు వినతి పత్రం అందించడం, వచ్చేనెల జనవరి 5వ తేదీన సోమవారం నుండి 26 జిల్లాలు పూర్తి అయ్యే వరకు విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందని సత్యనారాయణమూర్తి తెలిపారు. విజయవంతం చేయాలని సొసైటీ ఉద్యోగులను కోరారు. సొసైటీ కార్యదర్శి టివిఎస్.కుమార్, గుబ్బల శ్రీనివాసరావు, కొత్తపల్లి గోవిందరాజులు, రంగశెట్టి అర్జునరావు, మేళం ఫణి, కె.వెంకటస్వామి ఆధ్వర్యాన సిబ్బంది విధులకు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు.

నల్లబ్యాడ్జీలతో హాజరైన ఉద్యోగులు

రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం : మంత్రి

యలమంచిలి: రైతుల మేలు కోసం పనిచేసేది కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని మట్లపాలెం గ్రామంలో కూటమి ప్రభుత్వం, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మట్లపాలెం, మెరక, వడ్డిలంక, గంగడ పాలెం గ్రామాలకు చెందిన 200 మంది పాడి రైతులకు 50 శాతం ప్రభుత్వ సబ్సిడీపై పశువుల దాణా బస్తాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పశు వైద్య శిబిరంను కూటమి నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాడిపంటకు అండగా, తోడుగా, నీడగా పాడి బాగుంటేనే రైతు బాగుంటాడనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పాలకొల్లు నియోజకవర్గం మొత్తం మీద పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై 110 టన్నుల పశువుల దాణా 1750 మంది రైతులకు అందిస్తున్నామన్నారు. 50 కేజీల ఒక బస్తా విలువ రూ.1,110 కాగా రైతుకు రూ.555కే అందిస్తున్నామని, దీనివల్ల నియోజకవర్గం మొత్తం మీద రైతులకు రూ.12 లక్షల 21 వేలు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, నీటి సంఘం అధ్యక్షులు ఆరిమిల్లి రామ శ్రీనివాస్, మట్లపాలెం, నార్నిమెరక సర్పంచులు చల్లా పార్వతి, వలవల లక్ష్మి, నార్నిమెరక, యలమంచిలి, శిరగాలపల్లి, చించినాడ, ఏనుగువానిలంక సొసైటీ అధ్యక్షులు దేగల సత్తికొండ, బొప్పన హరి కిషోర్, రుద్రరాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

తాళ్లకోడు కాలనీని నగర పంచాయతీలో కలపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ఆకివీడు: ఆకివీడుకు చెందిన ప్రజలతో ఏర్పడిన తాళ్లకోడు ఎన్‌టిఆర్ కాలనీలో ఉన్న లబ్ధిదారులందరిని నగర పంచాయతీకి అనుసంధానం చేస్తూ నిర్ణయం తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆకివీడు ఏరియా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 25 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ఫలితంగా నగర పంచాయతీలోని పేదలకు 74 ఎకరాలు కొనుగోలు చేసి కాలనీని ఏర్పాటు చేసి, 3270 మందికి పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. 2020 నుండి ఇప్పటివరకు సుమారు 1500 మందికిపైగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని, మరో వెయ్యికిపైగా ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. అయినప్పటికీ కనీస సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో వచ్చిన నాటి నుండి కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీలిస్తున్నారు తప్ప ఇప్పటి వరకూ ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. కాలనీలో అభివృద్ధి శూన్యమన్నారు. తక్షణమే నిధులు కేటాయించి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీవాసులను నగర పంచాయతీ పరిధిలోకి తీసుకుని నగర పంచాయతీ ద్వారా సేవలందించాలన్నారు. కాలనీలో పెరిగిపోతున్న దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు, సభ్యులు పెంకి అప్పారావు, బివి.వర్మ, డి.రవితేజ, బి.రాంబాబు, దోకల లక్ష్మి, ఎస్.ఉదయకుమారి, బి.కళ్యాణి, ఎస్.పార్వతి, ఎస్.కిసింజర్ పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

భీమవరం : చిన్నారులు, మహిళలపై రోజురోజుకీ పెరుగుతున్న దాడులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. భీమవరం సిగ్ని స్కూల్లో ఐద్వా ఆధ్వర్యాన హింస వ్యతిరేక దినోత్సవం సెమినార్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ బాలికలు, మహిళల మీద హింస పెరిగిపోయిందన్నారు. దీన్ని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యువత మద్యం, గంజాయి మత్తు పదార్థాలకు బానిసలై దాడులకు తెగబడుతున్నారన్నారు. వీటిని అరికడితే మహిళల మీద జరిగే దాడులు తగ్గుతాయని, వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎం.సరోజిని, సిగ్ని స్కూల్ ప్రిన్సిపల్ జ్యోతి హరిసింగ్, ఉపాధ్యాయులు హిమ, అనిత, ఉషారాణి, శాంతి ప్రియ, మేరీ, భవాని, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా మహాసభ జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు

పాలకొల్లు : సిఐటియు అఖిల భారత మహాసభకు విశాఖకు తరలిరావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం మహాసభ పోస్టర్‌ను పాలకొల్లులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు జరిగే మహాసభలో ఉద్యమాన్ని సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చేందుకు లేబర్ చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్స్ తెచ్చిందని విమర్శించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని స్వభావం ఒకటే ఐనా సమాన పనికి సమానవేతనం ఇవ్వడం లేదన్నారు. ఈనెల 31 నుండి జనవరి 4 వరకు జరిగే ఈ మహాసభల చివరి రోజు లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో జవ్వాది శ్రీనివాసరావు, ఇరగవరపు రాజు, పి.రామారావు పాల్గొన్నారు.

ఆచంట : విశాఖపట్నంలో జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను కార్మికులు, ఉద్యోగులు విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బండి రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక రైస్ మిల్ వద్ద సిఐటియు అఖిలభారత మహాసభ గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైస్ మిల్లు కార్మికుల సంఘం మండల నాయకులు వేంద్ర దుర్గారావు, చొప్పల మోహన్, కడియపు పండు, బొబ్బ బసివిరెడ్డి, కేత కృష్ణ పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: పట్టణంలో ఎన్నో ఏళ్లుగా తీరలేని డంపింగ్ యార్డు సమస్య ఒకటి. ఈ సమస్యను అజెండాలో తీసుకొచ్చారు. తక్షణం ఈ అంశాన్ని ఆమోదించాలని విసి కొత్తపల్లి నాని, కౌన్సిలర్లు వన్నెంరెడ్డి శ్రీను, కోటిపల్లి సురేష్, కేసరి గంగరాజు, కృష్ణవేణి, అరుణలు పట్టుబట్టారు. దీనికి ఛైర్‌పర్సన్ వెంకటరమణ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తీర్మానం చేశామని, కొత్త రోడ్ల సాధ్య సాధ్యాలపై ఆలోచిద్దాం అని చెప్పడంతో ఆగ్రహించిన కౌన్సిలర్లు డంపింగ్ యార్డు అంశాన్ని ఆమోదించాలని పట్టుబట్టారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన సాగింది. పోలీసులు కూడా కార్యాలయానికి తరలివచ్చారు. ఛైర్‌పర్సన్ వైసిపి కౌన్సిలర్లు కారు ఎక్కి వెళ్లడంతో కూటమి కౌన్సిలర్లు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు కలుగ జేసుకుని ఇరువురిని నచ్చజెప్పి అక్కడ నుండి పంపించేశారు. మున్సిపల్ కార్యాలయానికి తాళం వేయడంతో కౌన్సిలర్లపై పాటు ఉద్యోగులు కూడా లోపలే ఉండిపోయారు. ఇద్దరు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో బాక్స్ టెండర్లపై రసాభాస జరిగింది. కౌన్సిలర్ల ఆమోదం లేకుండా కమిషనర్ బాక్స్ టెండర్లు ద్వారా నిధులు దుర్వినియోగం చేస్తున్నారని వైసిపి కౌన్సిలర్లు మండిపడ్డారు. కమిషనర్ అంజయ్యను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని వైసిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. తోటి కౌన్సిలర్లతో కలిసి తాళం వేసి అడ్డుకున్న కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని నరసాపురం డిఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. డిఎస్‌పి శ్రీవేద భీమవరం క్రైమ్ మీటింగ్‌కు వెళ్లడంతో టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి నిర్బంధించిన వారిపై ఫిర్యాదు చేస్తామన్నారు. ఇటు కూటమి కౌన్సిలర్లు అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుని నిరసన చేపట్టారు. అటుగా వెళ్తున్న ఎంపి, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ సెంటర్‌లో ఆగి కూటమి కౌన్సిలర్లతో మాట్లాడి జరిగిన విషయంపై ఆరా తీశారు.

97 అర్జీలు స్వీకరణ

ఇరగవరం: ఇరగవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యాన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ప్రజల నుండి సుమారుగా 97 అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. వచ్చిన అర్జీలలో తాగు నీరు, డ్రెయిన్స్, రోడ్స్, హౌసింగ్, శానిటేషన్ మొదలగు అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలు పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలకు అత్యధిక ప్రాధాన్యత దక్కుతోందని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, కూటమి నాయకులు, ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్, తహశీల్దార్ ఎం.సుందర్‌రాజు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది హాజరయ్యారు.

10న ఉచిత కేన్సర్ వైద్య శిబిరం

గణపవరం : లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఈనెల 10వ తేదీన స్థానిక డిగ్రీ కాలేజీ ఆవరణలో ఉచిత కేన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గణపవరం లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కెలం రవిబాబు, వెల్లంకి నరేష్ శనివారం చెప్పారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కేన్సర్ వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు జరపడం జరుగుతుందన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రికి సంబంధించిన వైద్యులు వైద్యాన్ని అందిస్తారని తెలిపారు. గణపవరం, నిడమర్రు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్యశిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అణగారిన తరగతుల హక్కులకై పోరాడిన మహనీయుడు అంబేద్కర్

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు
పలుచోట్ల ఘన నివాళి

పాలకొల్లు రూరల్: రక్తదానం చేస్తున్న మంత్రి

తణుకులో సిపిఎం ఆధ్వర్యాన..

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాజ్యాంగ రూపకర్త, ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పనిచేస్తూ తన తండ్రి పేరుతో ఏర్పాటుచేసిన ధర్మారావు ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పూలపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యాన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో 107వ రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో యువకులతో కలిసి స్వయంగా మంత్రి రక్తదానం చేశారు. ఆయనకు మొదట చేతి మీద నరం దొరకకపోవడంతో ప్రత్యేక వైద్యుల ద్వారా రక్తం సేకరించారు. ఆయనతోపాటు రక్తదానం చేసిన యువకులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్, కూల్ డ్రింకులను మంత్రి అందజేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి కూటమి నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్, వైస్ ఛైర్మన్ దాసరి రత్నం రాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్ ఉన్నమట్ల కబర్ది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భీమవరం : కలెక్టరేట్ ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి డిఆర్‌ఒ బి.శివన్నారాయణ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ శివన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్‌వి.అరుణ కుమారి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఎ.సూరిబాబు, కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ ఎఇ ఎవి.వెంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ, బిసి సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ పార్క్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్, పట్టణ కార్యదర్శి ఎ.అజయ కుమారి మాట్లాడుతూ.. అంబేద్కర్ నేడు భౌతికంగా మనముందు లేకపోయినా ఆయన అందించిన రాజ్యాంగం ఉందన్నారు. ప్రపంచ దేశాలు కూడా భారత రాజ్యాంగం గొప్పదని చెప్పడం జరిగిందని, ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన అవకాశాలు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, నాగరత్నం, అన్నపూర్ణ, ఎన్.చిన్నారావు, రాంబాబు, సుధాకర్, శివ, రామకృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

తణుకు : భిన్న మతాల, కులాల, తరగతుల హక్కులను కాపాడే విధంగా ఒక మార్గాన్ని నిర్దేశించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. బడుగు, బలహీన తరగతులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని శనివారం తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎంఎల్‌ఎ ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కొండేటి శివ, వివిధ దళిత సంఘాలకు చెందిన నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : క్రాంతి రేఖ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని వక్తలు కొనియాడారు. శనివారం మండలంలోని రూరల్ వెంప గ్రామం పెదపేటలో భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యువజన సంఘం, సిఐటియు ఆధ్వర్యాన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 66వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు బడుగు, బలహీన తరగతుల హక్కుల కోసం తన జీవితాన్నే ధారబోసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్, భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ ఇంజేటి ప్రభాకర్ రావు, భూపతి సంసోను, కాటికి రాజబాబు, తాటిపాక సుజ్ఞాన్ రాజ్, ది పార్టీ పెద్దిరాజు, వర్ధనపు రాంబాబు, మార్కు వర్ధనపు పండు పాల్గొన్నారు.

గణపవరం : అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అందరూ ఆచరించాలని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అ న్నారు. కాలేజీలో శనివారం అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో లెక్షరర్లు గణేష్ కుమార్, వి.శారాదదేవి, బి.శ్రీనివాస్, చైతన్యపర్వీన్, రాణిదుర్గా, పి.భాస్కర్‌రావు పాల్గొన్నారు.

భారతదేశ ఔనత్యాన్ని ప్రపంచ దేశాలలో చాటిచెప్పిన మహనీయుడు అంబేద్కర్ అని గణపవరం ఫ్రెండ్ సర్కిల్ నాయకులు కొనిశెట్టి గణేష్ అన్నారు. స్థానిక దళిత పేటలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అందరికీ ఆచరణీయమని తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు ఘన నివాళులర్పించారు. ఆయన 69వ వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో కాకర విజయ ప్రసాద్ ఆధ్వర్యాన టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గుబ్బల నాగరాజు, కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్ బాబు, మామిడి శెట్టి సత్యనారాయణ ఉన్నారు.

యలమంచిలిలో..

భీమవరం టౌన్‌లో..

కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ పి.శ్రీనివాస్, వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత, సర్వేయర్ ప్రసాద్, దాయం యేసురత్నం, సురగాల రవి, తాడిపర్తి ప్రసన్న కుమార్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరావు అన్నారు. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా అర్ధవరంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మా ట్లాడుతూ అంబేద్కర్ కోరిన సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. అ ంబేద్కర్ ఇండియన్ కన్వీనర్ బళ్లారపు ఆశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో కట్టూరి పేతూరి, కప్పల ఆనందరావు, అద్దంకి రాజేంద్ర, కొండేటి అబ్రహం, అద్దంకి హెూసన్న, ఎరిచర్ల లాజరు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవటానికి, అవగాహన చేసుకోవటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్యాంగ ప్రచార వేదిక పిలుపునిచ్చింది. స్థానిక గాంధీ మండపంలో రాజ్యాంగ ప్రచార వేదిక ఆధ్వర్యాన అంబేద్కర్ వర్ధంతి సభ జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ప్రత్తి వీరస్వామి అధ్యక్షతన జరిగింది. తొలుత అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రచార వేదిక కన్వీనర్ పి.గోవింద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవటానికి వేదిక కృషి చేస్తుందని తెలిపారు. ఎఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా సెక్రటరీ హరీష్, దళిత హక్కుల పోరాట కమిటీ స్టేట్ సెక్రటరీ కళింగ లక్ష్మణరావు, మున్సిపల్ వర్కర్ యూనియన్ స్టేట్ నాయకుడు దానాల వెంకట్రావు, మాజీ. మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఉండిలో కెవిపిఎస్ ఆధ్వర్యాన..

ఆచంట : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ బి ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచంట, కొడమంచిలి సర్పంచులు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్ డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెచ్చేటి సత్యనారాయణ, దొమ్మేటి రాంబాబు, నెక్కంటి రామలింగేశ్వర రావు, మెండే శ్రీనివాస్, రొక్కాల ఇమాన్యులు, అంబటి రాజు, కుక్కల లీలా ప్రసాద్, మట్టా చంటి, కోట గిరిధర్, కేతా తాతారావు, వేమన అప్పారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : భారతదేశానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగం శిరోధార్యం అని రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డ్ ఛైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి, టిడిపి పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, పెంటపాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక చైతన్యం కోసం అంబేద్కర్ ఆశయాలను యువత ముందుకు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు.

పెంటపాడు : భారత రాజ్యాంగం ప్రకారం సమాన అవకాశాలు కల్పించాలని, రాజ్యాంగం ద్వారా పాలకుల కుల నిర్మూలన, ఆర్థిక అసమానతలు రూపుమాపాలని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని వల్లూరుపల్లి గ్రామం అరుంధతి పేటలో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు మెరుపో సంతోష రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడారు. అనంతరం వల్లూరుపల్లి గ్రామానికి చెందిన విశాఖ స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి బాదంపూడి రవికుమార్ పిల్లలకు చదువుకు కావలసిన సామాగ్రి, స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వైవివైయు.ప్రసాద్, రాచర్ల కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు అడ్డగర్ల గంగరాజు, కెవిన్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు మెరుపో జాన్ రాజు, బాదంపూడి సురేష్ బాబు, సిర్ర శ్రీను, ఆబోతు చంద్రశేఖర్, కలపాల వీర్రాజు, బాదంపూడి సోమరాజు, మల్లిపూడి వాణి పాల్గొన్నారు.

పెనుమంట్ర : దేశంలో సమాజ వికాసంలో అంబేద్కర్ ఆశయాలు నిత్యం ప్రతిబింబిస్తాయని పెనుమంట్ర గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు అన్నారు. పంచాయతీ కార్యాలయంలో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు.

యలమంచిలి : మండల వ్యాప్తంగా అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని వివిధ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయా సంఘ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. చించినాడ గ్రామంలో పెదపేట, ఆర్లపాడు, విప్పర్తి వారి పేట, అరుంధతి పేటలలో కానేటి బాలరాజు, దేవ సుధాకర్, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, తెన్నేటి స్టాలిన్, మొమ్ముడివరపు ఆంజనేయులు, శెట్టిమి భాస్కరరావు, పల్లేరు వెంకటస్వామి, ఆకుమర్తి యేసు రత్నం, మురాల రాజేష్ తాడి ఉదయ్ కుమార్ విప్పర్తి రమేష్ పాల్గొన్నారు.

పెనుగొండ : వాడవాడలా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి నక్క శ్యామలా సోనీ శాస్త్రి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం: భారత రాజ్యాంగ ప్రచార వేదిక రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక అంబేద్కర్ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి సామాజిక కార్యకర్త కట్ట వేణుగోపాలకృష్ణ, గుత్తుల సాగర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజ్యాంగ ప్రచార వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు దక్షిణామూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజల హక్కులను, వాటిలో ఉండే గుణాలను ప్రజానీకం అవగాహన చేసుకుని రాజ్యాంగం ఉన్నతికి పాటుపడాలన్నారు. బిఎస్‌పి నాయకులు పీతల మనోహర్, న్యాయవాది సోడదాసి శ్రీధర్, సామాజిక కార్యకర్త గాడి నెహ్రూ, సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: బడుగు, బలహీన తరగతుల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆశయాల ప్రకారం అందరూ నడవాలని ఆచంట అసెంబ్లీ నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షులు కుసుమే వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆలమూరు గ్రామ మెయిన్ కెనాల్ సెంటర్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన సహచరులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆలమూరు అంబేద్కర్ కమిటీ ప్రతినిధులు న్యాయవాది పిల్లి రమేష్, అధ్యాపకులు పిల్లి చిన్న వెంకటేశులు, పిల్లి శ్రీనివాసరావు, కోట సుబ్బారావు పాల్గొన్నారు.

ఆకివీడు : ఆకివీడులో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో పార్టీ ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడవలసిన ప్రభుత్వాలే రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో పెంకి అప్పారావు, షేక్ వలి, దోకల రవితేజ, పి.పాండు, ఎం.భీష్మ, బి.వాసు, ఎల్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉండి: అణగారిన తరగతులకు సమన్యాయం, సమాన హక్కులు కల్పించేలా రాజ్యాంగాన్ని రచించిన భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రపంచ దేశాలకు దార్శనికుడు అని కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి కొనియాడారు. పాందువ్వ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కెవిపిఎస్ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపోయిన డ్వాక్రా సంఘాలకు న్యాయం చేయండి

దోషులపై విచారణ జరిపి శిక్షించండి : ఐద్వా

వినతి అందజేస్తున్న ఐద్వా నేతలు

ఆకివీడు : మండలంలోని డ్వాక్రా సంఘాల్లో జరిగిన అవకతవకలపై దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించి నష్టపోయిన వారిని ఆదుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సందక ఉదయ కుమారి కోరారు. ఈమేరకు ఐద్వా సభ్యులు మెప్మా అధికారి ప్రసాద్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ కుమారి మాట్లాడుతూ స్థానిక సంత మార్కెట్ ప్రాంతంలో దాదాపు 40 గ్రూపులు ఉన్నాయన్నారు. ఆ గ్రూపుల్లో అవకతవకలు జరిగాయన్నారు. వాటిలో ఒకటి వాసవి గ్రూపులో ఈ ఏడాది సిసిఎల్ లోన్ కింద రూ.5 లక్షలు మంజూరయ్యాయని, ఆ విషయం సభ్యులకు సైతం తెలియజేయకుండా యానిమేటర్ వాడుకోవడం జరిగిందన్నారు. డ్వాక్రా పేదలకు అండగా ఉండాలని, స్వయం ఉపాధి కల్పించడం కోసం ప్రభుత్వం కల్పించిన వెసులుబాటుని ఈవిధంగా దుర్వినియోగం చేయడం చాలా దారుణమని, వెంటనే దర్యాప్తు జరిపి బాధితులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. బొక్క కళ్యాణి, పంపన కృష్ణవేణి పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

తాడేపల్లిగూడెం : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ గ్రౌండ్‌లో నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యాన జరుగు నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడల పోటీలను శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 11 బ్రాంచిల వారు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. సబ్ జూనియర్, సీనియర్ లెవల్స్ రన్నింగ్ రేస్, డార్జి బాల్, చెస్, లీలే రెస్, ఖోఖో, కబడ్డీ వంటి గేమ్స్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ పుట్ వేర్ ప్రారంభం

భీమవరం టౌన్: భీమవరం డీ మార్ట్ పక్కన నూతన ఫ్యాక్టరీ పుట్ వేర్‌ను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. శనివారం చెప్పులు కొనేటప్పుడు ఎక్కువగా స్టైల్, బ్రాండ్, ధర వంటి విషయాలకే ప్రాముఖ్యత ఇస్తామని, వంద రకాల మోడల్స్‌లో చెప్పులు ఒకే చోట ఫ్యాక్టరీ ధరలకే లభించడం అభినందనీయమని ఎంఎల్‌ఎ అంజిబాబు అన్నారు. నిర్వాహకులు ఫజిల్(హైదరాబాద్) మాట్లాడుతూ నాణ్యమైన, మన్నికైన ఎన్నో రకాల చెప్పులు, షూస్‌లను ఫ్యాక్టరీ ధరలకే అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, సయ్యద్ ఖాజా పాల్గొన్నారు.

క్రీడోత్సవాల్లో బహుమతులు సాధించిన ఉపాధ్యాయులు

ఘనంగా ఉపాధ్యాయ క్రీడోత్సవాలు

కాళ్ల: ఉపాధ్యాయ క్రీడోత్సవాలు మండల పరిధిలో ఘనంగా నిర్వహించడం హర్షిణీయమని జిల్లా విద్యాశాఖ అధికారి విఎస్ఎస్ఎన్‌బిఎల్.నారాయణ అన్నారు. శనివారం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మండల ఆటల పోటీలు మహిళలకు త్రోబాల్, పురుషులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ పాల్గొని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఎంఇఒలు డి.శ్రీనివాసరావు, పి.యేసుదాసు, హెచ్‌ఎం కె.నిర్మలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE XIth ADDITIONAL DISTRICT JUDGE : TADEPALLIGUDEM
A.S.No.8/2025

Appellants : Uppalapati Phaneendra Chowdary and others
Respondents : Buddala Arjunarao and Others
To.
4th Respondent:
Pedasanaganti Seetaramachandra Murthy, S/o.Somayya, Near Anjaneyaswamy Temple, Relangi Village, Tanuku Mandalam .

పై నంబరు అప్పీలులో 4వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను సదరు నోటీసులు సంగతులు మీకు తెలిసియుండి సదరు నోటీసులు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు వుత్తర్వులు ఇచ్చి ది.17-12-2025కి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం 10.30 ని.లకు పైకోర్టులో హాజరై మీ అక్షేపణలు తెలుపుకోవలెను. లేనియడల మీ పరోక్షమందు పైనంబరు అప్పీలు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

Kusuluri Siva Rama Krishna
Advocate & Additional Public Prosecutor,
Tadepalligudem, W.G.Dt.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి : సిఐటియు

యలమంచిలి: లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని దొడ్డిపట్ల గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పనిగంటల విధానాన్ని పెంచి కార్మికుల శ్రమను దోచుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు చాలా బాధాకరమని, ఇప్పటికైనా అటువంటి విధానాలకు స్వస్తి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. నాగలక్ష్మి, చిన్ని తల్లి, పద్మశ్రీ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

మారెంపూడి చక్రధర్, తండ్రి :బాల విక్టర్, డోర్ నెంబర్ 3-72, కెనాల్ దగ్గర,కాజ(ఈస్ట్) యలమంచిలి మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను ది 24-08-2018లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి నెంబర్ S3818783 పాస్ పోర్ట్ పొందియున్నాను. ది 10-11-2025 న మా ఇంటి నుంచి పాలకొల్లు లోని జెరాక్స్ సెంటర్ లో నా పాస్ పోర్ట్ జెరాక్స్ తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడి పోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు.ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 9704851618

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) : TADEPALLIGUDEM
H.M.O.P.No.191/2025

Petitioner : Uppu Vijaya lakshmi
Respondents : Ankam Naga Venkata Satyanarayana
To.
Ankam Naga Venkata Satyanarayana, S/o.Veeraraghavulu, Door.No.4-52-2/4, Near Vivekananda Statue, Besides Municipal Primary School, Subbaraopeta, Tadepalligudem, TPG SCJC.

పై నంబరు O.P.No.191/2025లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు నుండి నోటీసులు పంపిగా సదరు పిటిషను సంగతులు తెలిసియుండి నోటీసులు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు వుత్తర్వులు ఇచ్చి ది.16-12-2025కి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం 10.30 ని.లకు పైకోర్టులో హాజరై మీ అక్షేపణలు తెలుపుకోవలెను. లేనియడల మీ పరోక్షమందు పైనంబరు పిటిషను తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

Kusuluri Siva Rama Krishna
Advocate & Additional Public Prosecutor,
Tadepalligudem, W.G.Dt.

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) CUM జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో
O.S.No.196/2025

బిట్వీన్ :
శ్రీమతి పెచ్చెట్టి విజయలక్ష్మి వగైరా ...వాదులు
అండ్
గుబ్బల కనకమ్మ వగైరా ...ప్రతివాదులు
సమన్స్ టు :
డి-6 : గుత్తుల పార్వతి, W/o.నాగరాజు, D/o.లేటు బొక్కా నాగమణి, వయస్సు 40 సం॥లు, హిందు, స్త్రీ, R/o.కొండేపూడి గ్రామం, పాలకోడేరు మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను, మీకు దావా సమన్లు పంపించినను, ఉద్దేశ్యపూర్వకంగా మీరు Avoid చేయుచున్నందున శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము యీ పేపరు ప్రకటన యివ్వబడినది. కాబట్టి మీరు ది.15-12-2025వ సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వేంద్ర గోపాలకృష్ణారావు
భీమవరం అడ్వకేట్, భీమవరం.
తేది.6-12-2025 సెల్: 9440174565

పబ్లిక్ నోటీసు

నా క్లయింటున్నూ కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, అన్నవరం గ్రామం, డోరునెం.1-17 కాపురస్తులు గణపవరపు (లేటు) జోగయ్య గారి కుమారుడు గణపవరపు నాగేశ్వరరావు, వయస్సు 67 సం॥లు, ఆధార్ నెం.21655345 3936, నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియ జేయునది ఏమనగా :-

నా క్లయింటు నూజివీడు సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, నూజివీడు రెవిన్యూ మండలం, అన్నవరం గ్రామ పంచాయితీ పరిధిలో చేరిన, అన్నవరం గ్రామ ఆర్.యస్.నెం. 344-2 దాఖలా య.1-12 సెంట్లలో దక్షిణ దిశగా గల య.0-56 సెంట్ల భూమి వాటా విభజన చేసుకొని, ది.31-01-2024వ తేదీన నా క్లయింటు, తన సోదరుడైన గణపవరపు వెంకటేశ్వరరావులు పార్టీషన్ దస్తావేజులు వ్రాసుకొని, నూజివీడు సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా డాక్యుమెంటు నెం.1041/2024రుగా రిజిష్టరు కాబడి, తదాది నా క్లయింటు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో అనుభవించుచున్నారు. ఇట్లుండగా ది.13-11-2025వ తేదీన ఉదయం సుమారు గం.9.00ల సమయంలో సదరు పై తెలిపిన డాక్యుమెంటు నెం.1041/2024రు గల ఓరిజినల్ పార్టీషన్ దస్తావేజు, ఇతర పత్రములను సంచిలో పెట్టుకొని నా క్లయింటు నూజివీడు, చిన్నగాంధీ బొమ్మ సెంటరులో గల జిరాక్సు షాపు వద్దకు వెళ్ళగా, దారి మధ్యలో సదరు సంచి ఎక్కడో జారి క్రింద పడిపోయింది. దానిపై నా క్లయింటు వచ్చిన దారిలో మరియు ఆ చుట్టు ప్రక్కల వెతికి చూసినప్పటికీ సదరు దస్తావేజు కనపడియుండలేదు. కావున పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అందజేయగలరు.

నూజివీడు **మన్నం రమేష్,** న్యాయవాది
తేది.06-12-2025 సెల్: 9440257636